క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని హాకీ ఖేలో ఇండియా సెంటర్‌లో హాకీ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు హాకీలో అనుభవం ఉండి, క్రీడ విజేతగా నిలిచిన జట్టులో ప్రాతినిధ్యం వహించి ఉండాలని తెలిపారు. అర్హులైన శిక్షకులు nsrs. kheloindia. gov. in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకో వా లని పేర్కొన్నారు. అనంతరం సదరు దరఖాస్తును అర్హత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల31లోగా స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 9885451164, 9381303380 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

‘ఉపాధి’ పనులు పరిశీలన


పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో ఉపాధి పనులను ఎంపీడీవో లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఎముందుగా నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పనులు పూర్తిచేయాలన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

నేరడిగొండ: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశకార్యకర్తలకు హెల్త్‌మేళా, ఓరియంటేషన్ యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చే దిశగా ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా హెల్త్ మేళాలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేపట్టారు. హెచ్‌ఈఓ పవార్ రవిందర్, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పూజలు

తాంసి: మండలంలోని పొన్నారి సంకట్‌మోచన్ హనుమాన్ ఆలయంలో ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రేమేందర్‌ను సన్మానించారు. ఆలయ వ్యవస్థాపకుడు మేఘరాజ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యుడు రఘునాథ్, నాయకులు ఆడప తిరుపతి, రాము, అఖిల్, శ్రీధర్, ప్రవీణ్, దత్తు ఉన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్‌లో నూతనంగా నిర్మించిన హనుమన్ ఆలయంలో మంగళ, బుధవారాల్లో విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గ్రామస్తులు మంగళవారం ఆవిష్కరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆంద్ ఆదివాసీ పెద్దలు కరేడే మారుతి, కేశవ్, డాకురే రాందాస్, పుండలిక్ పాటిల్, ముఖడే విష్ణు పాల్గొన్నారు.

భావేయిపెన్ పూజలు

బోథ్: సొనాల మండలంలోని పార్డి(కె) గ్రామంలో మంగళవారం అమావాస్య సందర్భంగా బావేయి పెన్ పూజలు నిర్వహించారు. రోకలికి కప్పను కట్టి భవేయి భవేయి అంటూ ఇంటింటికి తిరుగుతూ నృత్యాలు చేశారు. కాగా ఏటా మే నెలలో అమావాస్య రోజున ఆదివాసీలు భవేయి పెన్ పూజలు నిర్వహిస్తారు.

‘మోడల్ ’ప్రవేశపరీక్ష ఫలితాలు

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాల కోసం ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. సీట్లు సాధించిన విద్యార్థులు జూన్ 7లోగా టీసీ, బోనాఫైడ్, కుల ధ్రువీకరణపత్రంతో పాఠశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలని పేర్కొన్నారు.

వర్షంలో అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో నిరుపేదలకు అన్నదానం చేశారు. జోరుగా వర్షం కురుస్తున్నప్పటికి పేదల ఆకలిని తీర్చాలనే ఉద్దేశ్యంతో ట్రస్టు సభ్యులు అక్కడికి భోజనాన్ని తీసుకెళ్లి వారికి వడ్డించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బండ అనిల్‌కుమార్, సభ్యులు ఉదయ్‌కిరణ్, దేవేందర్, నరేశ్, రవి, రాజుయాదవ్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం


గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులు (ఫైల్)

- సమస్యల మధ్య లైబ్రరీ చదువులు
- ఇరుకు గదుల్లో నిరుద్యోగుల కుస్తీ
- అర్ధంతరంగా నిలిచిన నూతన భవన నిర్మాణం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం సమస్యలకు స్వాగతం పలుకుతున్నాయి. గ్రంథాలయ భవనాన్ని నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ ఆ పాత భవనంలో పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పోటీపరీక్షల నేపథ్యంలో ఇరుకు గదుల్లో చదువులు కొనసాగిస్తున్నారు. రోజురోజుకూ వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో స్థలం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూర్చోవడానికి స్టడీ చైర్స్, కుర్చీలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక స్వయంగా వారే కొనుగోలు చేసి తీసుకువచ్చి చదువుకోవాల్సిన దుస్థితి.

పాత భవనంలో చదువులు

ప్రస్తుతం ఉన్న గ్రంథాలయ భవనాన్ని నిర్మించి దశాబ్దాలు గడుస్తోంది. భవనానికి పైపై మెరుగులు దిద్దుతున్న అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచించడం లేదు. గ్రంథాలయ ప్రాంగణంలో నూతన భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడంతో ఇరుకు పాత భవనంలోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. నూతన భవనంలో కార్యాలయ సిబ్బంది కార్యకలాపాలు కొనసాగిస్తుండగా అభ్యర్థులు మాత్రం పాత భవనంలో చదువుకుంటున్నారు.


అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణం

పోటీపరీక్షల పుస్తకాలు కరువే..

గ్రంథాలయానికి రోజురోజుకు నిరుద్యోగ అభ్యర్థుల తాకిడి పెరుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుపేద నిరుద్యోగులకు గ్రంథాలయంలో పోటీపరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. డిమాండ్ ఉన్న పుస్తకాలు తీసుకువస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో తామే సొంత నోట్స్ వెంట తెచ్చుకుంటున్నామని నిరుద్యోగులు చెబుతున్నారు. గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో లేకపోతే ఎలా చదవాలని ప్రశ్నిస్తున్నారు.

కొత్త భవన నిర్మాణం పూర్తయ్యేనా..

మున్సిపాలిటీ పట్టణ ప్రగతి నిధులతో కొత్త భవన నిర్మాణాన్ని 2022లో ప్రారంభించారు. పలు కారణాలతో ఆ నిర్మాణం కాస్త నిలిచిపోయింది. దీంతో భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణం పూర్తయినప్పటికీ మొదటి అంతస్తు నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. నిర్మాణం పూర్తయితే పాఠకులకు స్థలాభావం సమస్య తీరనుంది. ఈదిశగా మున్సిపాలిటీ, గ్రంథాలయ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. మొదటి అంతస్తులో చదువుకోవడానికి తాత్కాలిక ఏర్పాట్లు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితేనే పాఠకుల అవసరాలు తీరనున్నాయి.

చైర్మన్ నియామకం లేనట్టేనా..

జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు చైర్మన్ లేకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. చైర్మన్ నియామకం చేపడితే ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టే అవకాశాలు ఉంటాయి. పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉండగా, జిల్లాలో మాత్రం లేకపోవడంతో సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక పాఠకులు ఆవేదన చెందుతున్నారు.

ఇబ్బంది లేకుండా చర్యలు

పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. వీలైనంత త్వరగా నూతన భవన నిర్మాణం పూర్తయ్యేలా కృషిచేస్తున్నాం. ఫ్లోరింగ్, కిటికీలు, డోర్లు ఏర్పాటు చేస్తే మొదటి అంతస్తు అందుబాటులోకి వస్తుంది. డిమాండ్ మేరకు పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం.
– బుగ్గారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, ఆదిలాబాద్

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు రైతులు పాటిస్తూ పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ సాగుపై సలహాల కూడిన పత్రాలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. గతంలో పండించిన పంటలను మళ్లీ సాగు చేయాలని సూచించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా కాకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డా.బి రాజేశ్వరి, డా.జి మంజులత, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ సాగుపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అవగాహనతోనే టీబీ నిర్మూలన సాధ్యం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: ప్రజలందరి అవగాహనతోనే టీబీ నిర్మూలన సాధ్యమవుతుందని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. మండలంలోని వాగ్దారి గ్రామంలో మంగళవారం 100 రోజుల టీబీ (క్షయవ్యాధి) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా త్వరితగతిన నిర్ధారణ, చికిత్స ద్వారా సమర్థంగా అదుపు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ప్రత్యేక యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రజలు పాల్గొనాలని కోరారు. మహిళలు, ఆశకార్యకర్తలు టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్‌ఎం గంగామణి, ఆశ కార్యకర్త శ్యామల, వనిత తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యనభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.అరుణ కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. 2017 నుంచి ఇప్పటివరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించలేని స్థితిలో ఉన్నవారు, నిరుద్యోగులుగా ఉన్నవారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడానికి గురుకుల విద్యాసంస్థ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 30 రోజులకుగాను ప్రతిరోజు మూడు గంటల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా చాచా నెహ్రూ వర్ధంతి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కై లాస్‌నగర్: స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత తొలి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మార్కెట్‌యార్డు సమీపంలోని చాచా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ ఆధునిక భారతదేశ నిర్మాత అని అన్నారు. విద్య, విజ్ఞాన శాస్త్రం, పారిశ్రామికీకరణలో ఎంతో కృషి చేశారన్నారు. ఐఐటీలు, ఐఐఎంల వంటి సంస్థల స్థాపనకు ఆయన వేసిన పునాది దేశ విద్యా వ్యవస్థను పటిష్టం చేసిందని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రభాకర్, రహీమ్, ఫెరోజ్‌ఖాన్, ఆఫ్సార్, అలీమ్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టాలి

- డీపీవో రమేశ్


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న రమేశ్

తాంసి: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పరిశుభ్రతతోపాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీపీవో రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని హస్నాపూర్ పంచాయతీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నర్సరీ, వైకుంఠధామంతోపాటు కంపోస్ట్‌షెడ్డు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో లింగయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి లావణ్యరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ మాట్లాడుతూ పట్టణంలోని పలు కార్పొరేట్ పాఠశాలలు అబద్ధాల ర్యాంక్‌లతో అక్రమ అడ్మిషన్లు చేపడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు నాగేందర్, మారుతి ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ఐసీపీఎస్ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అర్బన్ కేజీబీవీలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పేద, మధ్య తరగతి యువతులే అధికంగా అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. సైబర్ ట్రాకింగ్‌కు గురికావొద్దన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు తెలియజేయాలని సూచించారు. మహిళలను కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సభ్యులు సిరాజ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గన్నీబ్యాగులు లేక నిలిచిన జొన్న కొనుగోళ్లు

జైనథ్: మండల కేంద్రంలో మంగళవారం గన్నీబ్యాగులు లేక జొన్న కొనుగోళ్లు నిలిచిపోయాయి. గత నెల నుంచి ఇప్పటివరకు 60,335 వేల క్వింటాల్ జొన్న కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. రైతుల వద్ద నుంచి ఇప్పటివరకు 1,23,583 క్వింటాల్ జొన్న రావాల్సి ఉందన్నారు. మార్కెట్ యార్డుకు వాహనాల్లో జొన్న కొనుగోలుకు తీసుకురావడంతో రైతులు ఇక్కడ వేచి ఉండాల్సిన పరిస్థితి.

పంటలకు బీమా ఏదీ?

- ఆరేళ్లుగా నిలిపేసిన ఫసల్ బీమా పథకం
- ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలు
- పథకం అమలులో లేక అందని పరిహారం
- నష్టపోతున్న రైతులు

బోథ్: ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం జరిగితే ఆదుకునే పంట బీమా పథకం అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది. ఆరేళ్లుగా ఈ పథకం ఆగిపోయింది. జిల్లాలో గత రెండేళ్ల నుంచి అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పథకం అమలులో లేకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదు. దీంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

ఫసల్ బీమా యోజన ద్వారా

విపత్కర పరిస్థితుల్లో రైతుల పంటలు నష్టపోతే వారికి బీమా కల్పించి పరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని రాష్ట్రంలో గతంలో అమలు చేసి నిలిపివేశారు. గతంలో అన్నదాతలు పంట నష్టపోతే పంటల బీమా ద్వారా కొంతమేరకు లబ్ధిపొందారు.

కాంగ్రెస్‌పైనే ఆశలు

గత బీఆర్‌ఎస్..ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదొలగడంతో కొత్త పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదు. గత ఆరేళ్లుగా పంటల బీమా పథకం అమలు చేయలేక వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు నష్టపోయారు. తాము అధికారంలోకి వస్తే ‘పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా పంటల బీమా తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కమిటీ రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకంలో చేరుతుందా..? లేక కొత్తగా పంటల బీమా పథకం తీసుకువస్తుందా అనే ప్రశ్నగా మిగిలింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రవేశపెట్టాలి



రాష్ట్రంలో పంటల బీమా ప్రవేశపెట్టాలి. అధిక వర్షాలకు పంట నష్టం జరిగితే, పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి గత బీఆర్‌ఎస్ ఇన్సురెన్స్ కంపెనీలకు వాటా చెల్లించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన పంటలకు నష్టం జరిగితే పరిహారం అందించాలి.
– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

ఎంతో మేలు



పంటల బీమా ఉంటే పంట నష్టపోయిన రైతులకు మేలు చేకూరుతుంది. పంట పరిహారం అందుతుంది. గత రెండేళ్లుగా అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదు. పంటల బీమా ఉంటే ఇన్సురెన్స్ కంపెనీల ద్వారా పరిహారం అందేది.
– సోమ శంకర్, రైతు, బోథ్

తాత్కాలిక వంతెనపై వరదనీరు

సాత్నాల: అంతర్రాష్ట్ర రోడ్డు పనుల్లో భాగంగా భోరాజ్ మండలంలోని తరోడా వద్ద పాత బ్రిడ్జి కుంగడంతో తొలగించారు. వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టారు. మంగళవారం కురిసిన వర్షానికి వరద నీరు వంతెనపై పారుతోంది. ఆదిలాబాద్ నుంచి జైనథ్, బేల, గాద్‌వందూర్, చంద్రాపూర్, పట్టణాలకు ఇదే ప్రధాన రహదారి. గాద్‌వందూర్ నుంచి పెద్దఎత్తున సిమెంట్ సరఫరా అవుతోంది. నిత్యం కొన్ని వందల వాహనాల ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగిస్తుంటాయి. తాత్కాలిక వంతెన ఎత్తు మూడు ఫీట్ల ఉండడం చిన్నపాటి కురిసిన వర్షపు నీరు నిల్వ ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఈ బ్రిడ్జిని నిర్మించి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తే చర్యలు


తనిఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కిషన్

తలమడుగు: బక్రీద్ సందర్భంగా అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ కిషన్ హెచ్చరించారు. మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటుచేసిన తనిఖీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ–మహారాష్ట్ర అంతరాష్ట్ర రహదారిలో లక్ష్మీపూర్ వద్ద పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తనిఖీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా పశువులను అక్రమంగా తరలించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మండల వైద్యాధికారి లావణ్య, పోలీసులు తదితరులు ఉన్నారు.

తాంసి, బోథ్‌లో భారీ వర్షం

తాంసి: తాంసి, బోథ్ మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. గతవారం నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండటంతో తాంసి మండల రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమై పనులు చేపడుతున్నారు. మరో పక్క జొన్న చేలలో పనులు ఎలా చేసేదని పలువురు ఆందోళనకు గురవుతున్నారు. వర్షం కారణంగా తాంసి కొనుగోలు కేంద్రంలో జొన్నలు తడిసిపోయి దెబ్బతిన్నాయి. తడిసిన జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, బోథ్‌లోని వారసంతలో వరద నీరు చేరింది. కూరగాయలు, వస్తు సామగ్రి, ఆహార పదార్థాలు కొట్టుకుపోయాయి. ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అనుచరులతో భార్గవ్ భేటీ

కైలాస్‌నగర్: తన అనుచరులతో భార్గవ్ దేశ్‌పాండే మంగళవారం ఆదిలాబాద్‌లోని తన నివాసంలో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో డీసీసీ అధ్యక్షుడిగా పనిచేయడంతోపాటు కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన ఆయన గత కొంతకాలంగా స్తబ్దుగా ఉంటూ వచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని వ్యతిరేకించడంతో ఆయనపై పార్టీపరంగా సస్పెన్షన్ వేటుపడింది. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆయన సొంతగూటికి చేరేందుకు ప్రయత్నించారు. స్థానికంగా ఉన్న ఓ ముఖ్య నేత అడ్డుకున్నారనే ప్రచారం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్నాళ్లు హైదరాబాద్‌లో ఉంటూ వచ్చిన భార్గవ్ దేశ్‌పాండే ఆదిలాబాద్‌కు రావడం, తన అనుచరులతో సమావేశం కావడం కాంగ్రెస్‌లో చర్చకు దారి తీసింది. ఇకపై తన అనుచరులకు అండగా ఉండటంతోపాటు పూర్తిస్థాయిలో రాజకీయంగా అందుబాటులో ఉంటానని వారికి భరోసా ఇచ్చినట్లుగా ప్రచారం సాగుతోంది.